సాక్షి
వరంగల్

శుక్రవారం । 20 । జూన్ । 2025



కలహాల కాంగ్రెస్...

కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కలహాలు మరోసారి భగ్గుమన్నాయి. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు వ్యాఖ్యలతో బట్టబయలయ్యాయి.

- 10లో



అడవి తల్లి నుంచి.. పుడమి తల్లి ఒడికి

గాజర్ల రవి బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నేలకొరగగా నాటి ఉద్యమకారులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరవుతున్నారు. నేడు అంత్యక్రియలు జరగనున్నాయి.

- 10లో

గరిష్ఠం/కనిష్ఠం
34^0 /26^0

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది.

సమస్యల సర్కారు బడి

ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు కరువు

- అద్దె భవనాల్లో నడిచే స్కూళ్లలోనూ విద్యార్థులకు ఇబ్బందులే
- కాట్రపల్లి పీఎస్‌లో ఒకే గది.. అందులోనే స్టాఫ్‌రూం, ఐదు తరగతులు
- 'సాక్షి' క్షేత్రస్థాయి పరిశీలనలో పలు విషయాలు వెలుగులోకి..

సాక్షి, వరంగల్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు సమస్యలకు నిలయంగా మారుతున్నాయి. కొన్ని పాఠశాలలు అద్దె భవనాల్లో అరకొర వసతులతో కొనసాగుతుండడంతో విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. బాలురు బహిరంగ ప్రదేశాల్లో మూత్ర విసర్జన చేస్తుండగా, బాలికలు ఇంటికి వెళ్లి రావాల్సిన పరిస్థితి ఉంది. గురువారం సాక్షి పరిశీలనలో పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. సంగెం మండలం కాట్రపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒక గది ఉంది. ఇందులో స్టాఫ్‌రూం తోపాటు ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు. సరైన వసతులు లేకపోవడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తుండడంతో ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో 568 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 135 పాఠశాలల్లో విద్యార్థులు లేరు. ఇటీవల నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో చేరిన 3,896 మందితో విద్యార్థుల సంఖ్య 37,774కు చేరుకుంది. అలాగే, విద్యార్థులు లేని చోట కొందరు ఉపాధ్యాయులుండగా, విద్యార్థులున్న చోట ఉపాధ్యాయుల సంఖ్య తక్కువ ఉండడంతో ఇప్పటికే సర్దుబాటు దిశగా విద్యాధికారులు కసరత్తు చేస్తున్నారు.



సంగెం మండలం కాట్రపల్లి ప్రాథమిక పాఠశాలలో నిలిచిపోయిన మూత్రశాలల నిర్మాణం

విద్యార్థులు లేని పాఠశాలలు..



ఖాళీగా కూర్చున్న ఉపాధ్యాయుడు

పర్వతగిరి: మండలంలో విద్యార్థులు లేని 11 పాఠశాలలు ఉన్నట్లు ఎంఈఓ గాయపు లింగారెడ్డి తెలిపారు. చెరువుకొమ్ముతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను విజిట్ చేయగా విద్యార్థులు లేక ఖాళీగా ఒక్క ఉపాధ్యాయుడు మాత్రమే కనిపించాడు. గత సంవత్సరం 12 ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు లేరు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని బట్టుతండా పాఠశాలలో నలుగురు విద్యార్థులు చేరారు.



కాట్రపల్లి ప్రాథమిక పాఠశాలలో ఒకే గదిలో నిర్వహిస్తున్న ఐదు తరగతులు, స్టాఫ్‌రూం

సంగెం: పై ఫొటోలో కనిపిస్తున్నది కాట్రపల్లి ప్రాథమిక పాఠశాల. ఇందులో ఉన్న ఒకే గదిలో స్టాఫ్‌రూంతోపాటు ఒకటి నుంచి ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు. గదిలో బీరువాను అడ్డుపెట్టి ఒకవైపు ఒకటి నుంచి మూడు తరగతులు, మరోవైపు నాలుగు నుంచి ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు. 25 మంది విద్యార్థులకు ముగ్గురు ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారు. గ్రామానికి చెందిన రోజువారి కూలి పనులు చేసుకునే దంపతులు వర్కాల రజిత-మధు దంపతులు తమ ఇద్దరు పిల్లలను ఒకటో తరగతి, మరొకరిని మూడో తరగతిలో చేర్పించారు. మూడు రోజుల తర్వాత ఆ దంపతులు పాఠశాలకు వచ్చి తమ పిల్లలను మళ్లీ ప్రైవేట్ పాఠశాలకు పంపించినట్లు హెచ్‌ఎం పింగిళి సోమయ్య తెలిపారు. కాగా, కాట్రపల్లి ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థలో ఉండగా కూల్చివేశారు. అనంతరం మన ఊరు-మన బడి పథకంలో తరగతి గది మంజూరైంది. స్లాబ్ వరకు మాత్రమే నిర్మాణమై మూడేళ్లు కావొస్తోంది. ప్రస్తుతం ఉన్నత పాఠశాల ఒక గది ఇవ్వగా అందులోనే స్టాఫ్‌రూం, ఒకటి నుంచి ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు.

సాక్షి విజిట్

ఖానాపురం: ఈ కింది ఫొటోలో కనిపిస్తున్న పెద్దమ్మగడ్డలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మూడు సంవత్సరాల క్రితం విద్యార్థులతో కళకళలాడింది. ఇద్దరు ఉపాధ్యాయులు 17 మంది విద్యార్థులకు బోధన చేసేవారు. బదిలీల తర్వాత ఒకే ఉపాధ్యాయుడు 9 మంది విద్యార్థులకు పాఠాలు చెప్పాడు. బదిలీల్లో మరో ఉపాధ్యాయుడు వచ్చాడు. తర్వాత ఒక ఉపాధ్యాయుడు బదిలీ కాగా.. మరో ఉపాధ్యాయుడు పట్టించుకోకపోవడంతో పాఠశాలకు విద్యార్థులు రావడం లేదు. గత విద్యాసంవత్సరం చివర సదరు ఉపాధ్యాయుడిని డిప్యుటేషన్‌పై మరో పాఠశాలకు పంపారు. ఇటీవల ఖానాపురం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, సీఆర్పీలు బడిబాటకు వెళ్లగా ఇద్దరు ఉపాధ్యాయులు ఉంటే విద్యార్థులను పంపుతామని తల్లిదండ్రులు చెప్పడం విశేషం. దీంతో విద్యార్థులు లేకపోవడంతో పాఠశాలను మూసివేశారు.



39 పాఠశాలలు.. 2,709 మంది విద్యార్థులు



అనంతారం ప్రాథమిక పాఠశాలకు హాజరైన నలుగురు విద్యార్థులు

గీసుకొండ: మండలంలో 27 ప్రాథమిక, 12 ఉన్నత పాఠశాలల్లో మొత్తం 2,709 మంది విద్యార్థులు గత విద్యాసంవత్సరంలో ఉన్నారు. ఈ ఏడాది బడిబాట కార్యక్రమం కొనసాగుతోంది. కొత్త అడ్మిషన్లను ఇంకా ఆన్‌లైన్ చేయలేదు. అడ్మిషన్లు కొంతమేరకు పెరుగుతున్నాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదులు, మూత్రశాలు, మరుగుదొడ్ల సమస్య లేదు. గట్టుకిందిపల్లి, నందనాయక్ తండా, అనంతారం ప్రభుత్వ పాఠశాలల్లో ఒక్కోదాంట్లో పది మందిలోపే విద్యార్థులు ఉన్నారు. అనంతారం ప్రాథమిక పాఠశాలను గురువారం సందర్శించగా నలుగురు విద్యార్థులే హాజరయ్యారు.

అద్దె ఇంటిలో గేట్‌పల్లి పాఠశాల



అద్దె ఇంటిలో చదువుకుంటున్న విద్యార్థులు

నెక్కొండ: మండలంలోని గేట్‌పల్లి ప్రాథమిక పాఠశాల అసౌకర్యాలకు నిలయంగా మారింది. ఐదేళ్ల క్రితం పాఠశాల తరగతి గదులు శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందారు. ప్రమాదం పొంచి ఉండడంతో చెట్లకిందే విద్యార్థులకు చదువులు కొనసాగాయి. పాఠశాల మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకురాలు సలీమా ఇంటి ఆవరణను అద్దెకు తీసుకున్నారు. దీంతో గతేడాది నుంచి అక్కడే విద్యార్థుల చదువులు కొనసాగుతున్నాయి. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఉన్న పాఠశాలలో 14 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. మూత్రశాలలు లేక ఇబ్బందులు పడుతున్నారు. నెలకు రూ.900 అద్దె చెల్లిస్తున్నామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్యాంసుందర్ తెలిపారు. ఇప్పటికైనా పాఠశాలకు సొంత భవనం నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఒకే తరగతి గది.. 24 మంది విద్యార్థులు



ఒకే తరగతి గది ఉన్న గార్లగడ్డతండాలోని ప్రభుత్వ పాఠశాల

నర్సంపేట రూరల్: రాజుపేట గ్రామ శివారులోని గార్లగడ్డతండాలో మొత్తం 24 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ ఏడాది బడిబాట కార్యక్రమంలో ఏడుగురు కొత్త విద్యార్థులు చేరారు. 24 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నా తరగతి గది మాత్రం ఒకటే ఉంది. వంటగది లేకపోవడంతో మధ్యాహ్న భోజనాన్ని కార్మికులు ఇంటి వద్ద వండుకొని వచ్చి విద్యార్థులకు వడిస్తున్నారు. పాఠశాలకు ప్రహరీ లేదు. తాత్కాలికంగా ఫెన్సింగ్ వేశారు. గేటు లేకపోవడంతో జంతువులు ఇష్టానుసారంగా వస్తున్నాయి.

ఐదు పాఠశాలల్లో విద్యార్థులు నిల్



తొగరురామయ్యపల్లిలో విద్యార్థులు లేక వెలవెలబోతున్న ప్రాథమిక పాఠశాల

దుగ్గొండి: మండల పరిధిలో 7 ఉన్నత పాఠశాలలు, 7 ప్రాథమికోన్నత పాఠశాలలు, 22 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. తొగరురామయ్యపల్లి, కేశవాపురం, బొబ్బరోనిపల్లి, గుడిమహేశ్వరం గ్రామాల పాఠశాలల్లో ఒక్కో ఉపాధ్యాయుడు చొప్పున ఉండగా విద్యార్థులు అసలే లేరు. చాపలబండ ప్రాథమికోన్నత పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా విద్యార్థులు లేరు. మిగిలిన అన్ని పాఠశాలలలో సౌకర్యాలు ఉన్నాయి. నాచినపల్లి ప్రాథమిక పాఠశాలలో గత సంవత్సరం 20 మంది విద్యార్థులు ఉండగా ఈసారి ఆ సంఖ్య 40 మందికి చేరింది. ఇక్కడ ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా మరో ఇద్దరు ఉపాధ్యాయుల కోసం విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

గొల్లపల్లి పాఠశాలలో 10 మంది విద్యార్థులు..



గొల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో ప్రార్థన చేయిస్తున్న హెచ్‌ఎం నార్లగిరి రాజు, ఉపాధ్యాయురాలు రజిత

నల్లబెల్లి: విద్యార్థులు లేరనే కారణంతో గతంలో కొండాయిల్‌పల్లి, శంషాబాద్, మామిండ్లవీరయ్యపల్లి, లైన్‌తండా, సాయిరెడ్డిపల్లి, గొల్లపల్లి, రామారావుతండా, బజ్జుతండా, పోచంపల్లి ప్రాథమిక పాఠశాలల, ముచ్చింపుల ఉన్నత పాఠశాలను అధికారులు మూసివేశారు. గొల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం నార్లగిరి రాజు, ఉపాధ్యాయురాలు రజిత బడిబాటలో కార్యక్రమంలో భాగంగా 10 మంది విద్యార్థులను చేర్పించారు. పాఠశాల పునఃప్రారంభోత్సవానికి కృషిచేసిన హెచ్‌ఎం, ఉపాధ్యాయురాలిని ఎంఈఓ అనురాధ, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల నాయకులు, గ్రామస్తులు అభినందించారు. విద్యార్థులు లేరనే కారణంతో శంషాబాద్, మామిండ్లవీరయ్యపల్లి, కొండాయిల్, లైన్‌తండా, సాయిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలు, ఉపాధ్యాయులు లేరనే కారణంతో రామారావుతండా, బజ్జుతండా, పోచంపల్లి ప్రాథమిక పాఠశాలలు, ముచ్చింపుల ఉన్నత పాఠశాలలు ప్రారంభం కాలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మూసివేసిన పాఠశాలలను ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

న్యూస్‌రీల్

వ్యాధులు ప్రబలకుండా చూడాలి : డీఎంహెచ్‌ఓ



నెక్కొండ: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని డీఎంహెచ్‌ఓ సాంబశివరావు అన్నారు. అలంకానిపేట పీహెచ్‌సీని గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి మాట్లాడారు. వానాకాలంలో అంటువ్యాధులు వ్యాపించకుండా రోడ్లు, ముఖ్య కూడళ్లు, డ్రెయినేజీల్లో వర్షపు నీరు నిల్వకుండా చూడాలని సూచించారు. వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండి ఇంటింటి సర్వే చేపట్టాలని, వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. ఆయన వెంట వైద్యాధికారి అఖిల్, సూపర్‌వైజర్ రమాదేవి, సిబ్బంది సునీత, దివ్య, అరుణ, సుజాత, ఆశ వర్కర్లు ఉన్నారు.

పన్నులు వసూలు చేయాలి : డీపీఓ



దుగ్గొండి: గ్రామ పంచాయతీల్లో వంద శాతం పన్నులు వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి కల్పన అన్నారు. వెంకటాపురం గ్రామ పంచాయతీని గురువారం ఆమె తనిఖీ చేశారు. పన్నుల వసూళ్ల రికార్డులు, జమ-ఖర్చుల రిజిస్టర్, సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. గ్రామంలో శిథిలావస్థకు చేరిన గృహాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడారు. గ్రామంలో ప్రతిరోజూ ఉదయమే పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, వర్షాకాలం ప్రారంభమైనందున బ్లీచింగ్ పౌడర్ అందుబాటులో ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఆమె వెంట మండల పంచాయతీ అధికారి మోడెం శ్రీధర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి యాదగిరి ఉన్నారు.

విస్తృతంగా తపాలా సేవలు



గీసుకొండ: ప్రజలకు విస్తృతంగా సేవలు అందించడానికి తపాలా శాఖ ముందుకు వస్తోందని వరంగల్ సౌత్ సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ పి.వరప్రసాద్ అన్నారు. గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారం తపాలా కార్యాలయంలో గురువారం నిర్వహించిన డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (డీసీడీపీ)లో ఆయన మాట్లాడారు. తపాలా శాఖలోని సేవింగ్, రికరింగ్, టర్మ్ డిపాజిట్, సుకన్య సమృద్ధి, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, సీనియర్ సిటిజన్స్ సేవింగ్ ఖాతాలను ఉపయోగించుకోవాలని కోరారు. స్పీడ్, రిజిస్టర్ పోస్టు, పార్సిల్ బుకింగ్, బీమా పథకాలు ఉన్నాయని పేర్కొన్నారు. తక్కువ ప్రీమియంతో గ్రూప్ యాక్సిడెంట్ గార్డు(జీఏడీ) పాలసీలు ఉన్నాయని వివరించారు. ధర్మారం పోస్ట్ మాస్టర్ నీలిమ, సిబ్బంది రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు స్టేను ధిక్కరించిన కాంట్రాక్టర్



గీసుకొండ: గ్రేటర్ వరంగల్ నగరం 15వ డివిజన్ గొర్రెకుంటలో కొత్తగా విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైంది. సబ్‌స్టేషన్ నిర్మాణ కోసం గురువారం బోరు వేయడానికి కాంట్రాక్టర్ బోరు బండితో రాగా సదరు భూమి తమ కులస్తులదని, ఈ విషయమై హైకోర్టును ఆశ్రయించగా స్టే విధించిందని స్థానిక మాలకులస్తులు అడ్డుకున్నారు. వద్దని చెప్పినా బోరు వేయడానికి కాంట్రాక్టర్ రావడంతో వారు 100కు డయల్ చేశారు. పరిశీలించిన పోలీసులు బోరు వాహనాన్ని గీసుకొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించిన కాంట్రాక్టర్, ఎస్పీడీసీఎల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశామని మాలకులస్తులు తెలిపారు.

సేవ చేయడం అదృష్టంగా భావిస్తా

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



కేశవాపురంలో సీసీరోడ్డు పనులు ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

రాయపర్తి: తనను నమ్ముకున్న ప్రజలకు సేవ చేయడం అదృష్టంగా భావించి, సంక్షేమ పథకాలను అందేలా చూస్తానని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలువురు ఇందిరమ్మ ఇళ్ల ప్రస్తావన తీసుకురాగా.. ఇప్పుడు ఇచ్చేది మొదటి విడత మాత్రమేనని రెండో విడతలో అర్హులందరికీ ఇళ్లు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నమ్మకంతో తనను గెలిపించినందుకు నియోజకవర్గంలోని గ్రామాలను అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. రూ.14 కోట్లతో మండల కేంద్రంలో మంజూరైన గోదాం పనులు ప్రారంభించనున్నట్లు వివరించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. పెర్కవేడు, కొత్తూరు, కొత్తతండా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో ముచ్చటించారు. సౌకర్యాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో బ్లాక్ కాంగ్రెస్ తొర్రూరు అధ్యక్షుడు హామ్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు ఈదుల కంటి రవీందర్‌రెడ్డి, టీఎం కృష్ణమాచార్యులు, నంగునూరి అశోక్, పెండ్లి మహేందర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వనజారాణి, మందాటి సుదర్శన్‌రెడ్డి, ఎనగందుల మురళి, కుందూరు రత్నాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

భూగర్భ జలాలను సంరక్షించాలి



కాట్రపల్లిలో నిర్మించిన ఇంకుడుగుంతను పరిశీలిస్తున్న అధికారులు

రాయపర్తి: భూగర్భ జలాలు సంరక్షణ అందరి బాధ్యత అని జిల్లా నోడల్ ఆఫీసర్ డి.చైతన్య పేర్కొన్నారు. తిర్మలాయపల్లి, కొండూరు, బురహాన్‌పల్లి, కాట్రపల్లి, కొలన్‌పల్లి, పోతిరెడ్డిపల్లి, కిష్టాపురం, మొరిపిరాల, సన్నూరు, మైలారం, రాయపర్తి, జగన్నాథపల్లి, ఏకేతండా గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన ఇంకుడుగుంతలు, ఫారం పాండ్ తదితర పనులను పరిశీలించి మాట్లాడారు. జల సంచాయ్-జల భాగిరథి కార్యక్రమంలో భాగంగా పనులు పరిశీలించినట్లు తెలిపారు. ఏపీఓ కుమార్‌గౌడ్, ఈసీ ప్రవీణ్, సీటీఏలు సురేశ్, సుధాకర్, టీఏలు కిషన్‌రెడ్డి, వెంకన్న, యాకూబ్, సందీప్, పంచాయతీ కార్యదర్శులు వినోద్, విజయేందర్, రాజు, మహేందర్, అంబేద్కర్, రాకేశ్, అస్మా, రాధిక, వెంకటేశ్, ఫీల్డ్‌అసిస్టెంట్లు యాకలక్ష్మి, సుధాకర్, కవిత, అరుణ, సృజన, దేవేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో రూ.119.42 కోట్లు జమ



ఖిలా వరంగల్: రైతు భరోసా పథకాన్ని ప్రభుత్వం పక్కాగా అమలు చేస్తోంది. గురువారం 1,41,727 మంది రైతుల ఖాతాల్లో రూ.119.42 కోట్లు జమ య్యాయని జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ తెలిపారు. రైతు భరోసా నిధులు ప్రభుత్వం జమ చేయడంతో జిల్లాలోని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

టెక్నికల్ పోస్టుల భర్తీలో గందరగోళం

- 50 మందికి నియామకపత్రాలు ఇచ్చిన గణేశ్ ఏజెన్సీ
- జీఓ వస్తేనే విధుల్లో చేర్చుకుంటామన్న నర్సంపేట వైద్యకళాశాల ప్రిన్సిపాల్



నియామకపత్రాలతో వైద్య కళాశాలకు వచ్చిన సిబ్బంది



గణేశ్ ఏజెన్సీ ఇచ్చిన నియామక పత్రం

నర్సంపేట రూరల్: నర్సంపేట ఆస్పత్రి, వైద్య కళాశాలలో చేపట్టిన ఔట్‌సోర్సింగ్ టెక్నికల్ పోస్టుల భర్తీలో గందరగోళం నెలకొంది. గణేశ్ ఏజెన్సీ 50 మందికి నియామకపత్రాలు ఇవ్వగా.. జీఓ వచ్చిన తర్వాతనే వారిని విధుల్లోకి తీసుకుంటామని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్ తిరిగి పంపించిన ఘటన నర్సంపేట ఆస్పత్రిలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రిని జిల్లా ఆస్పత్రి, వైద్య కళాశాలగా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. గత ఏడాది వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, జిల్లా ఇన్‌చార్జ్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అటవీ పర్యావరణ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వైద్య కళాశాల, ఆస్పత్రిని ప్రారంభించారు. అయితే, 180 టెక్నికల్ పోస్టులను భర్తీ చేసేందుకు గత ఏడాది నోటిఫికేషన్ ఇవ్వగా సుమారు 5 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. అప్పుడు దరఖాస్తులు స్వీకరించిన నవోదయ ఏజెన్సీ నిర్వాహకులు డబ్బులు వసూలు చేశారని ఆరోపణలు వచ్చాయి. దీంతో దరఖాస్తులను కళాశాల సిబ్బంది స్వాధీనం చేసుకుని కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ ఏజెన్సీ రద్దు చేశారు. అప్పటి నుంచి పోస్టుల భర్తీ పెండింగ్‌లోనే ఉంది. ఇటీవల పోస్టుల భర్తీని గణేశ్ మ్యాన్‌పవర్ సర్వీస్ ఏజెన్సీకి అప్పగించారు. ఆ ఏజెన్సీ 50 మందికి నియామకపత్రాలు అందించింది. గురువారం ఆ నియామక పత్రాలతో వారు ప్రభుత్వ ఆస్పత్రి, వైద్య కళాశాలకు చేరుకున్నారు. తమకు జీఓ కాపీ వచ్చిన తర్వాతే సిబ్బందిని తీసుకుంటామని చెప్పడంతో వారు అయోమయంలో పడిపోయారు.

మెరిట్ ఆధారంగానే నియామక పత్రాలు ..

జీఓ ఆధారంగానే నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో 50 టెక్నికల్ పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టాం. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సమక్షంలో మెరిట్ లిస్టు ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసి నియామక పత్రాలు అందించాం, వారు విధుల్లో చేరేందుకు ఆస్పత్రికి వెళ్లగా చేర్చుకోలేదు. జీఓ లేకుంటే ఎలా నియమిస్తాం.

- ఓదెల మొగిలి, గణేశ్ ఏజెన్సీ నిర్వాహకుడు

మాకు జీఓ రాలేదు..

నర్సంపేట ఆస్పత్రిలో టెక్నికల్ పోస్టులను ఏజెన్సీ ఆధ్వర్యంలో భర్తీ చేస్తున్నట్లు మాకు ఎలాంటి జీఓ రాలేదు. ఈనెల 12న కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో టెక్నికల్ పోస్టుల భర్తీ కోసం అనుమతి ఇవ్వాలని కలెక్టర్‌ను కోరాం. కలెక్టర్ వాటికి సంబంధించిన నోట్‌ఫైల్ తయారుచేసి పంపించాలని కోరగా పంపించాం. కానీ, మాకు టెక్నికల్ పోస్టులను భర్తీ చేయాలని జీఓ రాలేదు. గణేశ్ ఏజెన్సీ వారు ఇచ్చిన నియామకపత్రాలు పట్టుకొని వచ్చిన వారితో మాట్లాడాం. మాకు జీఓ కాపీ వచ్చిన తర్వాతే తీసుకుంటామని చెప్పాం. కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీ తుది నిర్ణయం మేరకే ముందుకు సాగుతాం.

- డాక్టర్ మోహన్‌దాస్, నర్సంపేట వైద్య కళాశాల ప్రిన్సిపాల్

రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు

- వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య



మాట్లాడుతున్న ఏసీపీ అంబటి నర్సయ్య

వర్ధన్నపేట: రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య హెచ్చరించారు. వర్ధన్నపేట, రాయపర్తి, జఫర్‌గఢ్ పరిధిలోని విత్తన, ఎరువుల డీలర్లతో వ్యవసాయ, పోలీస్ శాఖ అధికారులు గురువారం నిర్వహించిన సమావేశంలో ఏసీపీ మాట్లాడారు. రైతులకు విత్తన, ఎరువుల డీలర్లు అన్ని రకాలుగా సహకరించాలని సూచించారు. నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయించకూడదని, రైతులకు కచ్చితంగా రశీదులు అందజేయాలి స్పష్టం చేశారు. మండల వ్యవసాయ అధికారి విజయ్‌కుమార్ మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవాలన్నారు.వ్యాపారులు విడి విత్తనాలను విక్రయించకూడదని, మోతాదుకు మించి పురుగు మందులు పిచికారీ చేసేలా రైతులను ప్రోత్సహించకూడదన్నారు. ఎస్సైలు చందర్, రాజు, విత్తన డీలర్లు, షాపుల యజమానులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దూరవిద్య కోర్సుల అడ్మిషన్లకు నోటిఫికేషన్



నోటిఫికేషన్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్య కేంద్రంలో డిగ్రీ, పీజీ డిప్లొమా సర్టిఫికెట్, ఓరియెంటేషన్ కోర్సుల్లో ఈ విద్యాసంవత్సరం 2025–2026లో ప్రవేశాలకుగాను నోటిఫికేషన్ విడుదల చేశారు. గురువారం ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్లను వీసీ కె.ప్రతాప్‌రెడ్డి విడుదల చేశారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చునని దూరవిద్యకేంద్రం డైరెక్టర్ బి.సురేశ్‌లాల్ తెలిపారు. ఈ నెల 20వ తేదీనుంచి జూలై 31వరకు దరఖాస్తులు సమర్పించవచ్చని పేర్కొన్నారు. కోర్సులు, ఫీజుల వివరాలు సంబంధిత వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ వి. రామచంద్రం, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ పద్మజ, దూరవిద్యకేంద్రం సైన్స్‌కోర్సుల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌ముంజం, డాక్టర్ వి.జగన్, డాక్టర్ కొట్టే భాస్కర్ పాల్గొన్నారు.

అన్నను చంపిన ఘటనలో ఐదుగురిపై కేసు నమోదు

కురవి: అన్నను చంపిన ఘటనలో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీరోలు ఎస్సై నగేశ్ గురువారం తెలిపారు. సీరోలు గ్రామానికి చెందిన వల్లపు లింగన్న తన భూమిని సమానంగా పంచి ఇవ్వలేదనే కారణంతో అతడి రెండో భార్య కుమారులు నరేశ్, మహేశ్, నరేశ్ భార్య సౌందర్య, లింగన్న రెండో భార్య నర్సమ్మ, నున్న వీరన్న (నరేశ్ బావమరిది) కలిసి లింగన్న మొదటి భార్య కుమారుడు కృష్ణను ఈ 18న కత్తితో నరికి చంపారు. ఈ ఘటనలో మృతుడి తండ్రి లింగన్న ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నగేశ్ తెలిపారు.

చెక్ బౌన్స్ కేసులో ఆరునెలలు జైలు

వరంగల్ లీగల్ : అప్పుగా తీసుకున్న రూ.4 లక్షలు చెల్లించని కారణంగా బాధితుడు కోర్టును ఆశ్రయించడంతో నిందితురాలికి ఆరు నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ హనుమకొండ మొదటి మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి సీహెచ్. శ్రావణస్వాతి గురువారం తీర్పు వెలువరించారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ బ్రాహ్మణవాడకు చెందిన సుంకరి నరేందర్.. కాజీపేట సిద్ధార్థనగర్‌కు చెందిన యాట భాగ్యలక్ష్మికి 2024, జూన్ 15వ తేదీన రూ.4 లక్షల అప్పు ఇచ్చాడు. ఈ మేరకు భాగ్యలక్ష్మి.. నరేందర్‌కు ప్రామిసరీ నోటు రాసి ఇచ్చింది. రెండు నెలల్లో మొత్తం తిరిగి ఇస్తానని చెప్పింది. అయితే వివిధ కారణాలతో ఇవ్వకుండా సెప్టెంబర్‌లో హనుమకొండలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సంబంధించిన రూ.4లక్షల చెక్కు ఇచ్చింది. సదరు డబ్బులు డ్రా చేసే నిమిత్తం నరేందర్ 2024, అక్టోబర్ 10వ తేదీన చెక్కును బ్యాంకులో వేయగా అకౌంట్‌లో సరిపోను డబ్బులు లేవని అధికారులు చెక్కు చెల్లదని తిరిగి ఇచ్చారు. దీనిపై బాధితుడు తన న్యాయవాది బైరి మల్లేశం ద్వారా కోర్టును ఆశ్రయించాడు. విచారించిన కోర్టు.. చెల్లని చెక్కు ఇచ్చిన ఘటనలో నేరం రుజువుకావడంతో నిందితురాలు భాగ్యలక్ష్మికి ఆరు నెలల జైలు శిక్ష, అప్పుగా తీసుకున్న మొత్తం రూ.4 లక్షలకు వడ్డీ, జరిమానా కింద రూ.3 లక్షలు మొత్తం రూ.7 లక్షలు చెల్లించాలని తీర్పు వెలువరించింది.

కలహాల కాంగ్రెస్...

కొండా మురళీధర్‌రావు వ్యాఖ్యలతో బట్టబయలు

- తారస్థాయికి చేరిన కాంగ్రెస్ గ్రూపువార్
- సొంత పార్టీ ఎమ్మెల్యేలను టార్గెట్ చేసిన మాజీ ఎమ్మెల్సీ కొండా
- ఎమ్మెల్యేలు రేవూరి, కడియంపై సీరియస్ వ్యాఖ్యలు
- ఓరుగల్లు కాంగ్రెస్‌లో మళ్లీ రాజకీయ దుమారం
- తాజా పరిస్థితులపై కాంగ్రెస్ అధిష్టానం ఆరా?



కడియం శ్రీహరి



కొండా మురళీధర్‌రావు



రేవూరి ప్రకాశ్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, వరంగల్ : కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కలహాలు మరోసారి భగ్గుమన్నాయి. నివురుగప్పిన నిప్పులా ఉన్న విభేదాలు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు వ్యాఖ్యలతో బట్టబయలయ్యాయి. రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా గురువారం వరంగల్ పోచమ్మమైదాన్‌లో జరిగిన కార్యక్రమంలో సొంత పార్టీ ఎమ్మెల్యేలను టార్గెట్ చేయడం చర్చనీయాంశంగా మారింది. పరోక్షంగా ఆయన పార్టీ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై నోరు పారేసుకోవడం పార్టీవర్గాల్లో కలకలం రేపింది. కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీ రాజకీయాల్లో స్తబ్ధత కనిపిస్తున్నా.. కొండా మురళి వ్యాఖ్యలతో ఒక్కసారిగా రచ్చమొదలైంది. ఈ వ్యాఖ్యలపై కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి గాని స్పందించకపోగా, వారి అనుచరులు సైతం మౌనం వహించారు. పార్టీలో తీవ్ర సంచలనంగా మారిన కొండా మురళీధర్‌రావు వ్యాఖ్యలపై పార్టీ అధిష్టానం సీనియర్ నాయకుల ద్వారా ఆరా తీసినట్లు సమాచారం.

మాజీ టీడీపీ నేతలే లక్ష్యంగా...

ఓరుగల్లు కాంగ్రెస్ నేతల మధ్య కొంతకాలంగా అంతర్గత కలహాలు సాగుతున్నాయి. ప్రధానంగా మంత్రి కొండా సురేఖ, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మధ్య గతంలోనూ పరస్పర ఆరోపణలకు సంబంధించిన ఆడియో రికార్డు సోషల్ మీడియాలో వైరలైంది. ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో కొందరు ఎమ్మెల్యేలు కొండా సురేఖకు వ్యతిరేకంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారన్న ప్రచారం జరిగింది. ఇందులో ప్రధానంగా గతంలో టీడీపీలో పనిచేసి.. ప్రస్తుతం కాంగ్రెస్‌లో కొనసాగుతున్న కొందరు ఎమ్మెల్యేలు తమపై దుష్ప్రచారం చేస్తున్నారని కూడా కొండా సురేఖ దంపతులు చాలాసార్లు తమ అనుచరులతో వ్యాఖ్యానించారు. ఇదే క్రమంలో కొండా మురళీధర్‌రావు గురువారం పోచమ్మమైదాన్ సభలో కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై ఘాటైన వ్యాఖ్యలు చేయడం కలకలంగా మారింది. 'కనుబొమ్మలు లేని నాయకుడు టీడీపీని భ్రష్టు పట్టించి.. చంద్రబాబును ఓడించి కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచి కాంగ్రెస్‌లో నాటి ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ తిష్ట వేశాడన్న' కొండా మురళీధర్‌రావు... '75 ఏళ్ల దరిద్రుడు, ముసలోడు ఎన్నికలకు ముందు మా వద్దకు వచ్చి మా కాళ్లు పట్టుకొని ఈసారి సీటు నాకు వదిలిపెట్టమని ప్రాధేయపడితే మా మద్దతుతో పరకాల ఎమ్మెల్యే అయ్యాడు' అని ఇద్దరిపై ఘాటైన ఆరోపణలు చేయడం రాజకీయవర్గాల్లో దుమారం రేపుతోంది.

గురువారం ఉదంతంపై అధిష్టానం ఆరా...

వరంగల్ కాంగ్రెస్‌లో దుమారం రేపిన మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ వ్యాఖ్యలపై పార్టీ అధిష్టానం ఆరా తీస్తున్నట్లు తెలిసింది. కాంగ్రెస్ పార్టీలో ఇటీవలి పరిణామాలపై ఓ వైపు ప్రభుత్వ ఇంటెలిజెన్స్ ద్వారా నివేదికలు ఇప్పటికే తెప్పించుకున్న ప్రభుత్వ పెద్దలు.. పార్టీ సీనియర్‌ల ద్వారా 'వరంగల్‌లో అసలేం జరుగుతోంది'ని ఆరా తీసినట్లు అత్యంత విశ్వసనీయవర్గాల సమాచారం. గురువారం రాత్రి కూడా ఉమ్మడి వరంగల్‌కు చెందిన నలుగురు సీనియర్ నాయకులతో టీపీసీసీ పెద్దలు మాట్లాడినట్లు తెలిసింది. అలాగే, గ్రేటర్ వరంగల్ పరిధిలోని ఇద్దరు ఎమ్మెల్యేలతో కూడా రాష్ట్ర పార్టీ బాధ్యులు ఒకరు మాట్లాడినట్లు సమాచారం. త్వరలోనే ఉమ్మడి వరంగల్‌కు చెందిన కొందరు ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలను హైదరాబాద్‌కు పిలిచి మాట్లాడే అవకాశం ఉందని కూడా పార్టీవర్గాల ద్వారా తెలిసింది.

ఆర్ట్స్ కాలేజీ డిగ్రీ సెమిస్టర్ల పరీక్షల ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం, తదితరులు

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ (అటానమస్)లో బీఏ, బీకాం, బీఎస్సీ 2,4,6 సెమిస్టర్ల పరీక్షల ఫలితాలను గురువారం కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి ఆ కళాశాలలో విడుదల చేశారు. రెండో సెమిస్టర్ పరీక్షలకు 1,236మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 620 మంది (50.16శాతం) ఉత్తీర్ణత సాధించారు. నాలుగో సెమిస్టర్ పరీక్షలకు 927మంది విద్యార్థులు హాజరుకాగా 540 మంది ఉత్తీర్ణత(58.25శాతం) సాధించారు. అలాగే, ఆరో సెమిస్టర్ పరీక్షలకు 742 మంది విద్యార్థులు హాజరుకాగా 582 మంది (78.44శాతం) ఉత్తీర్ణత సాధించారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతి తెలిపారు. కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ వి. రామచంద్రం, పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్, ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్, ఆ కళాశాల పరీక్షల నియంత్రణాధికారి సుధీర్, గిరిప్రసాద్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

పసుపు రైతుల ఆందోళన

- ధర వ్యత్యాసంతో వ్యాపారులపై అన్నదాతల అసహనం
- సర్దిచెప్పిన మార్కెట్ అధికారులు
- మధ్యాహ్నం తర్వాత ప్రారంభమైన కాంటాలు



మార్కెట్‌లో ఆందోళన చేస్తున్న రైతులు

వరంగల్ చౌరస్తా : తెలంగాణ రాష్ట్రంలోని ఇతర మార్కెట్లలో పసుపు క్వింటాల్‌కు ధర రూ. 12,500 పలుకుతుండగా, వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో రూ. 10వేల చొప్పున వ్యాపారులు కొనుగోలు చేస్తుండడంతో గురువారం రైతులు ఆందోళన చేపట్టారు. ధర పెంచే వరకూ అమ్మబోమని తేల్చిచెప్పారు. దీంతో కాంటాలు నిలిచాయి. వ్యాపారులు తమను దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ అధికారులు చొరవ చూపించినా రైతులు అంగీకరించలేదు. చివరకు మార్కెట్ కార్యదర్శి గుగులోత్ రెడ్డి జోక్యం చేసుకుని వ్యాపారులతో చర్చలు జరపగా, క్వాలిటీ పసుపునకే ఎక్కువ ధర చెల్లిస్తామని, లేనిపక్షంలో చెల్లించమని పేర్కొన్నారు. అనంతరం కార్యదర్శి రైతులతో మాట్లాడి సరైన ధరలు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో కాంటాలు ప్రారంభమయ్యాయి.

సీసీఐ కొనుగోళ్ల విధానం కొనసాగించాలి

- వరంగల్ చాంబర్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి



సదస్సులో రాష్ట్ర కాటన్ వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి

వరంగల్ చౌరస్తా : ప్రస్తుతం రాష్ట్రంలో సీసీఐ ద్వారా కొనుగోలు జరుపుతున్న విధానంతోనే పత్తి రైతులకు మేలు చేకూరుతుందని వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు, కాంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి అన్నారు. ఢిల్లీలోని నీతి ఆయోగ్ భవన్‌లో గురువారం 'బహిరంగ మార్కెట్‌లో పత్తికి మార్కెట్ ధర, కనీస మద్దతు కంటే తక్కువ ధరలు పలుకుతున్న వ్యత్యాసాలు' అనే అంశంపై జరిగిన సదస్సుకు వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు, కాటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మనీష్ మల్పానీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రైస్ డెఫిసిట్ పేమెంట్ స్కీం 2025–26 కాటన్ సీజన్‌లో తెలంగాణలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రవేశపెట్టి స్కీం అమలులో ఎదురయ్యే సమస్యలపై రవీందర్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణలో పత్తి కొనుగోళ్లకు అవసరమైన సదుపాయాలు, రెగ్యులేటెడ్ మార్కెట్లలో పత్తి నాణ్యత, బహిరంగ మార్కెట్‌లోని ధరలను నిర్ధారించడానికి ఎలాంటి ప్రత్యేక వ్యవస్థలు లేవన్నారు. అందుకే ప్రస్తుతం రాష్ట్రంలో సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు జరుపుతున్న విధానమే రైతులకు మేలు చేకూరుతుందన్నారు. పత్తి కొనుగోళ్లలో కనీస మద్దతు కంటే తక్కువ ధర పలికితే ఆ వ్యత్యాసపు ధరను నేరుగా రైతులకు చెల్లించడానికి కేంద్రం ప్రభుత్వం ప్రైస్ డెఫిసిట్ పేమెంట్ స్కీంను పైలట్ ప్రాజెక్టు కింద వచ్చే ఏడాది నుంచి రాష్ట్రంలో అమలు చేస్తున్నట్లు ప్రకటించినట్లు రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో కేంద్ర మంత్రిత్వ శాఖ ఫైనాన్స్ డైరెక్టర్ పవన్ కుమార్, మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ జాయింట్ సెక్రటరీ లలిత్ కుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

అన్నకు తమ్ముడి శఠగోపం

- వ్యాపారంలో రూ.1. 37 కోట్లు ముంచిన తమ్ముడు
- న్యాయం చేయాలని బాధితుడి వేడుకోలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాధితుడు చల్లా సాంబలింగం

వరంగల్ చౌరస్తా : అన్నకు తమ్ముడు శఠగోపం పెట్టాడు. నమ్మి క్యాష్ కౌంటర్‌పై కూర్చోబెట్టినందుకు రూ.1.37 కోట్లు స్వాహా చేశాడు. మోసం చేయడమే కాకుండా బెదిరింపులకు పాల్పడుతున్నాడు. దీనిపై చాంబర్ ప్రతినిధులు, పోలీసులు స్పందించి తనకు న్యాయం చేయాలని బాధితుడు (అన్న) చల్లా సాంబలింగం విజ్ఞప్తి చేశాడు. ఈ మేరకు గురువారం వరంగల్ వ్యవసాయ మార్కెట్ సమీపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను, తన తమ్ముడు సంపత్ కలిసి ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో 2016 నుంచి కేశవ ట్రేడర్స్ పేరుతో మిర్చి వ్యాపారం ప్రారంభించినట్లు తెలిపారు. ఈ క్రమంలో తాను బయట విషయాలు చూసుకుంటుండగా తన తమ్ముడు సంపత్ క్యాష్ కౌంటర్ పై కూర్చుని ఆర్థిక లావాదేవీలు చూసేవాడన్నారు. ఈ క్రమంలో రూ.1.37 కోట్లు మోసం చేశారని పేర్కొన్నారు. తనకు రావాల్సిన డబ్బులు అడిగితే ఇవ్వనని.. పైగా డబ్బులు అడిగితే చంపుతానని బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తాను చాంబర్ ఆఫ్ కామర్స్ జాయింట్ సెక్రటరీ చక్రపాణి వద్దకు వెళ్లగా అతడు పంచాయితీ నిర్వహించి తనకు రావాల్సిన డబ్బును చెల్లించాలని తన తమ్ముడికి చెప్పారన్నారు. అయితే తన తమ్ముడు చెల్లించకపోవడంతో మూడు నెలల క్రితం ఏనుమాముల పీఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయినా చాంబర్ ప్రతినిధులు, పోలీసులు పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా స్పందించి తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.

అడవి నుంచి.. పుడమి తల్లి ఒడికి

నేడు మావోయిస్టు నేత గాజర్ల రవి అంత్యక్రియలు

- స్వగ్రామం వెలిశాలలో ఆయన జ్ఞాపకార్థం వెలిసిన ఫ్లెక్సీలు
- చివరి చూపు కోసం గ్రామస్తుల ఎదురుచూపు



వెలిశాలలో గ్రామస్తులు

టేకుమట్ల: గాజర్ల రవి.. పెత్తందార్లు, దొరల అరాచకాల నుంచి పీడిత ప్రజల విముక్తి కోసం మూడు దశాబ్దాలకు పైగా మావోయిస్టు సానుభూతిపరుడిగా, విద్యార్థి యూనియన్ నాయకుడిగా ఉద్యమంలోకి అడుగు పెట్టి దళ కమాండర్ బాధ్యతలు చేపట్టాడు. నాయకత్వ లక్షణాలు పుణికి పుచ్చుకుని అనతి కాలంలోనే నార్త్ తెలంగాణ డివిజన్ కమిటీకి ఎన్నికై కేంద్ర కమిటీ సభ్యుడిగా, స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శిగా కీలక బాధ్యతలు తీసుకుని ఉద్యమంలో నూతన ఒరవడికి నాంది పలికాడు. ఎన్నో కీలక ఆపరేషన్లు విజయవంతంగా చేపట్టి పార్టీ బలోపేతానికి కృషి చేయడమే కాకుండా క్యాడర్‌ను కంటికి రెప్పలా కాపాడుకున్నాడు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాల గ్రామానికి చెందిన గాజర్ల రవి 1992లో అడవి బాట పట్టాడు. అప్పటి నుంచి వెనుదిరిగి చూడలేదు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నేలకొరిగాడు.

ఉద్యమాలే ఊపిరిగా..

కుటుంబ సభ్యుల కన్నా ఉద్యమాలే ఊపిరిగా, ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా మూడు దశాబ్దాలుగా అడవి తల్లి ఒడిలో కాలం గడిపాడు. తల్లిదండ్రులను సైతం కాదని అడవి తల్లి చెంతకు చేరిన గాజర్ల రవి ఉద్యమ ప్రస్థానం బుధవారంతో ముగియడంతో శుక్రవారం పుడమి తల్లి ఒడికి చేరనున్నాడనని నాటి ఉద్యమకారులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరవుతున్నారు. రవి జ్ఞాపకార్థం వెలిశాలతోపాటు, పలు గ్రామాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

చివరి చూపు కోసం ఎదురుచూపు..

ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు నేత గాజర్ల రవి అలియాస్ గణేశ్ మృతి చెందాడనే సమాచారం సోషల్‌మీడియాలో దావానంలా వ్యాపించడంతో వెలిశాల ఒక్కసారిగా ఉలిక్కిపడింది. రెండు రోజులుగా గాజర్ల రవి చివరి చూపు కోసం జిల్లా వ్యాప్తంగా ఎదురు చూస్తున్నారు. గురువారం రాత్రి రంపచోడవరంలో పోస్టుమార్టం నిర్వహించారు. దీంతో సోదరులు గాజర్ల సమ్మయ్య, అశోక్.. రవి పార్థివదేహాన్ని స్వగ్రామం వెలిశాలకు తీసుకురానున్నారు. కాగా, బుధవారం నుంచే వెలిశాలలో పోలీసులు రెక్కీ నిర్వహిస్తున్నారు.

చర్చల సమయంలో చివరిగా చూశా..



2004లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు మావోయిస్టులను చర్చలకు పిలువగా వరంగల్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి రవ(రవి)న్న చర్చల ప్రతినిధిగా వస్తున్నాడని తెలిసి వెళ్లా. ఎంతో మంది ప్రజలు హాజరైన కార్యక్రమంలో దూరం నుంచి చూశా. ఇప్పుడు విగత జీవిగా చూస్తామని అనుకోలేదు.

–అచ్చె లచ్చన్న, మాజీ సర్పంచ్, రామకిష్టాపూర్(వి)

నేడు కేయూలో ఉద్యోగ సంఘాల ఎన్నికలు

- ముగిసిన ప్రచార హోరు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో శుక్రవారం ఎన్‌జీఓ ఎంప్లాయీస్, క్లాస్ ఫోర్త్ అసోసియేషన్ల ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేశారు. యూనివర్సిటీ ప్రిన్సిపల్ కార్యాలయం, పరిపాలన భవనంలోని సెనేట్‌హాల్, సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ , ఖమ్మం పీజీ కాలేజీ, భద్రాద్రి కొత్తగూడెం కళాశాలల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ నిర్వహిస్తారు. ఈనెల 21న ఉదయం 11 గంటలకు ఓట్ల లెక్కింపు పక్రియ ప్రారంభం కానుంది. ఆ తర్వాత ఫలితాలు వెల్లడిస్తారు.

క్యాంపస్‌లో సందడే.. సందడి

రెండు అసోసియేషన్ల ఎన్నికల నేపథ్యంలో ఆయా ఉద్యోగుల ప్రచారంతో క్యాంపస్‌లో కొద్ది రోజులుగా సందడి నెలకొంది. ఈ క్రమంలో ఎన్నికల బరిలో పోటీపడుతున్న అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి. కేయూ ఎన్‌జీఓ అసోసియేషన్ అధ్యక్ష పదవికి బి.నవీన్ కుమార్, జి. నిరంజన్ పోటీపడుతున్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా ఎండి. యూనస్, పి. భాస్కర్, జనరల్ సెక్రటరీ పదవికి వల్లాల తిరుపతి, సయ్యద్ అక్రమ్ అహ్మద్, జాయింట్ సెక్రటరీ ఆర్గనైజేషన్ (జనరల్)కు ఎ. సతీశ్‌బాబు, బి. రాజు పోటీపడుతున్నారు. జాయింట్ సెక్రటరీ ఆర్గనైజేషన్ (ఉమెన్) పదవికి బి. కృష్ణవేణి, గౌసియాబేగం, దేవమ్మ, జాయింట్ సెక్రటరీ ఆర్గనైజేషన్ (రిక్రియేషన్)కు జి. మధుకర్, టి. ప్రభాకర్, పి. సునీల్, ట్రెజరరీగా సీహెచ్. ప్రవీణ్‌కుమార్, టి. దామోదర్ పోటీపడుతున్నారు. 222 మంది ఉద్యోగులు తమ ఓటుహక్కు వినియోగించుకోబోతున్నారు.

కేయూ క్లాస్‌ఫోర్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్..

కాకతీయ యూనివర్సిటీ క్లాస్‌ఫోర్త్ ఎంప్లాయీస్ ఎన్నికల్లో అధ్యక్ష పదవికి పి. గుమ్మయ్య, ఎండి. నిజాముద్దీన్ పోటీపడుతున్నారు.జాయింట్ సెక్రటరీ ఆర్గనైజేషన్(జనరల్) పదవికి ఎండి. వలిపాషా, టి. రాజేశ్వర్, జాయింట్ సెక్రటరీ ఆర్గనైజేషన్ (రిక్రియేషన్) పదవికి ఎస్. ఐలయ్య, పి. వేణు, ట్రెజరరీ పదవికి టి.తరుమల్ శ్రీనివాస్‌సింగ్, పి. రామనాథం పోటీపడుతున్నారు. 79 మంది ఉద్యోగులు తమ ఓటుహక్కు వినియోగించుకోబోతున్నారు.

ఇప్పటికే ముగ్గురు ఏకగ్రీవం..

క్లాస్‌ఫోర్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఎన్నికల్లో జనరల్ సెక్రటరీ పదవికి బొక్క మొగిలి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా పి. అంకూస్, జాయింట్ సెక్రటరీ ఆర్గనైజేషన్ (ఉమెన్)గా జి. మల్లికాంబ ఏకగ్రీవంగా ఎన్నికై న విషయం విధితమే.

పోటాపోటీ ప్రచారం..

ఈ రెండు అసోసియేషన్ల ఎన్నికల్లో పోటీపడుతున్న వారు విస్తృత ప్రచారం నిర్వహించారు. సామాజిక మాధ్యమాల్లోనూ ప్రచారం చేశారు. అన్ని విభాగాలు, కాలేజీల్లో తిరుగుతూ ఓటర్లను అభ్యర్థించారు. గురువారం సాయంత్రం ప్రచారం ముగిసింది. ఎన్నికైన వారు రెండు సంవత్సరాలు ఆ పదవుల్లో ఉంటారు.

'జంపన్న' సుందరీకరణ ..

- వాగు అభివృద్ధి పనులకు నిధులు
- రూ. 5 కోట్లు కేటాయించిన ప్రభుత్వం
- ఆహ్లాదకరంగా మారనున్న స్నానఘట్టాలు



మేడారంలోని జంపన్న వాగు

ఎస్‌ఎస్‌తాడ్వాయి: ములుగు జిల్లా ఎస్‌ఎస్ తాడ్వాయి మండలం మేడారం మహాజాతర సమయంలో కోట్లాది మంది పుణ్యస్నానాలు ఆచరించే జంపన్న వాగును సుందరీకరించనున్నారు. భక్తులకు మరింత ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు రూ. 5 కోట్లు మంజూరు చేసినట్లు తెలిసింది. ఈ నిధులతో వాగును అభివృద్ధి చేయనున్నారు. మంత్రి సీతక్క చొరవ మేరకు జంపన్న వాగుపై రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రభుత్వం ఈ నిధులు మంజూరు చేసినట్లు సమాచారం.

జంపన్న వాగు ఒడ్డున పార్కులు, బెంచీల ఏర్పాటు..

జంపన్న వాగుపై రెండు వైపులా స్నాన ఘట్టాలు నిర్మించారు. జాతర సమయంలో భక్తులు స్నాన ఘట్టాలపై అమర్చిన బ్యాటరీ ఆఫ్ ట్యాబ్స్ ద్వారా స్నానాలు ఆచరిస్తారు. అయితే వాగుపై స్నాన ఘట్టాలు తప్ప కొత్తదనం ఏమీ కనిపించదు. ఈ నేపథ్యంలో ఈసారి మహాజాతర నాటికి స్నాన ఘట్టాల వద్ద భక్తులకు ఆహ్లాదకర వాతావరణం అందించేందుకు పార్కులు, కూర్చునేందుకు బెంచీలు ఏర్పాటు చేయనున్నారు. అంతేకాకుండా ఒకటి రెండు కాటేజీలను కూడా నిర్మించనున్నారు. జాతర సమయంలో భక్తులు ఎండ, వర్షం నుంచి ఉపశమనం పొందేందుకు జంపన్న వాగు ఒడ్డున షెడ్లు కూడా నిర్మించే అవకాశం ఉంది. ఫలితంగా సుందరీకరణతో ఈసారి జాతరకు వచ్చే భక్తులకు జంపన్న వాగు ఆకర్షణీయంగా కనిపించనుంది.

మంత్రి సీతక్క చొరవతో..

రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క మేడారంలో భక్తుల సౌకర్యార్థం శాశ్వత అభివృద్ధి పనులపై దృష్టిసారించారు. ఇందులో భాగంగా జంపన్న వాగు భక్తులకు ఆకర్షణీయంగా కనిపించాలనే సంకల్పంతో సుందరీకరణ పనులకు నిధుల మంజూరుకు కృషి చేసినట్లు తెలుస్తోంది. జంపన్న వాగులో ఫౌంటెన్ కూడా ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. గత మహాజాతరలోనే సమ్మక్క–సారలమ్మ చిహ్నాలుగా వాటర్ ఫౌంటెన్ ఏర్పాటు చేయాలనే ఆలోచన చేశారు. అయితే ఆ ఆలోచన కార్యరూపం దాల్చలేదు. ఈ నేపథ్యంలో ఈసారి మహాజాతర వరకు రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈవిషయంపై టూరిజం కార్పొరేషన్ ఏఈ విజయకుమార్‌ను వివరణ అడగగా జంపన్నవాగులో రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు తనకు సమాచారం తెలియదన్నారు. నేటి(శుక్రవారం) మధ్యాహ్నం కల్లా వివరాలు తెలుస్తాయన్నారు.

247 క్యూసెక్కుల నీరు పంపింగ్



దేవాదుల వద్ద మోటార్లు

కన్నాయిగూడెం: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెంలోని దేవాదుల ఇన్‌టేక్ వెల్ వద్ద ఒక మోటారు ద్వారా పంపింగ్ నిలిపివేశారు. పంపింగ్ వద్ద మూడు ఫేజ్‌లలో పది మోటార్లు ఉండగా అందులో సెకండ్ ఫేజ్‌లో ఉన్న రెండు మోటార్లను ఆన్ చేసి 494 క్యూసెక్కుల నీటిని దిగువకు బుధవారం వరకు పంపింగ్ చేశారు. ఈ క్రమంలో గురువారం అందులోని ఒక మోటారును ఆఫ్ చేసి మరో మోటారు ద్వారా 247 క్యూసెక్కుల నీటిని మాత్రమే దిగువకు పంపింగ్ చేస్తున్నారు. ప్రస్తుతం దేవాదుల వద్ద 73.20 మీటర్ల నీటిమట్టం కొనసాగుతోంది. దీనితో పాటు తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద ఎగువ నుంచి 5,800 క్యూసెక్కుల నీరు చేరుతుండడంతో బ్యారేజీ వద్ద రెండు గేట్లను ఎత్తి 6,000క్యూసెక్కుల నీరు దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద 73.45మీటర్ల నీటి మట్టం కొనసాగుతోంది

జఫర్‌గఢ్‌లో ఎలుగుబంట్ల సంచారం

- భయాందోళనలో గ్రామస్తులు



పల్లె ప్రకృతి వనం నుంచి వెళ్తున్న ఎలుగుబంటి

జఫర్‌గఢ్: జఫర్‌గఢ్‌లో రెండు రోజుల నుంచి ఎలుగుబంట్లు సంచరిస్తుండడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. జఫర్‌గఢ్ చుట్టూ గుట్టలు ఉండడంతో ఎలుగుబంట్లు అందులో నివాసం ఉంటున్నాయి. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం బయన్నగుట్టల సమీపంలో దమ్మన్నపేటకు వెళ్లే రహదారిపై ఎలుగుబంటి తన పిల్లలతో వెళ్తుండగా స్థానికులు చూసి భయాందోళనకు గురయ్యారు. గురువారం కూడా జఫర్‌గఢ్ శివారులోని పల్లె పకృతి వనంలో ఎలుగుబంటి తన పిల్లలతో కలిసి ఉంది. ఈ దృశ్యాన్ని చూసిన స్థానికులు ఎలుగుబంటిని అక్కడి నుంచి తరిమికొట్టడంతో పంట పొలాల మీదుగా మసీదు బండ నుంచి వెళ్లింది. దీంతో స్థానికులు, రైతులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, కొన్నేళ్ల నుంచి గుట్టలపై ఎలుగుబంట్లు నివాసం ఉంటూ గ్రామ పరిసరాల్లో సంచరిస్తుండడంతో గ్రామస్తులు, రైతులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు స్పందించి ఎలుగుబంట్ల బంధించి వేరే అటవీ ప్రాంతానికి తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.